।। श्रीहरिः ।।

# भलेका फल भला

(तेलुगु)

|| శ్రీహరిః ||

# ప్రథమ అధ్యాయం

భారతమాత ఉన్నత శిఖరాలపై ఎగిసి స్వర్గసుఖాలను అనుభవిస్తున్న తరుణంలోని వ్యాఖ్యానాన్ని పాఠక మహాశయులముందు సవినయంగా వివరించే ప్రయత్నం చేయగలుగుతున్నాము. ఆమె సంతానం అన్నివిధాలా శాంతి, సౌఖ్యాలతో, ఆరోగ్యవంతులై సదాచార సంపన్నులై, సర్వ స్వతంత్ర భావాలతో జీవనం కొనసాగిస్తున్నారు. ధనవంతులు, మాన్యవంతులు, ఉద్యోగులు, విద్యావంతులు, జ్ఞానులు, ఎల్లవేళలా సద్గుణవంతులై భాసిల్లుతున్నారు. క్షమ, దయ, పరోపకార సంస్కారములను ఇతర దేశస్థులు వీరినుండి గ్రహించవలసినదే! ఆ సమయంలో వాణిజ్య నిమిత్తం ఇచటినుండి వ్యాపారులు ఇతర దేశాలకు తరలివెళ్ళేవారు, అదేవిధంగా విదేశీవర్తకులు యీ దేశానికి వచ్చేవారు.

ఆ సమయంలో బొంబాయి - కలకత్తావంటి మహానగరాలు అన్నివిధాలా సమృద్ధిగా వుండినవి. వాణిజ్యక్షేత్రాలు కావడంవల్ల అన్నిప్రాంతాలు జనంతో ఎల్లవేళలా కళకళలాడుతుండేవి.

చిన్న చిన్న పట్టణాలు, నగరాలు, గ్రామాల పరిస్థితులు అనుకూలత గలిగి ప్రజాజీవనం సుఖశాంతులతో వర్థిల్లుతున్న సమయం.

బౌద్ధధర్మప్రచారం ముమ్మరంగా సాగుతున్న రోజులు. బుద్ధదేవుని ప్రచార ప్రభావ కృపాకటాక్షాలతో శాంతి, పవిత్రభావాల సంగీతం అంతటా ప్రతిధ్వనిస్తున్నాయి.

రాజులు, మహారాజులు, ధనికులు అనే వ్యత్యాసం లేకుండా సమస్త ప్రజలు బౌద్ధధర్మప్రచారం నిర్విరామంగా కొనసాగిస్తున్నారు. వేలాదిమంది బౌద్ధసన్యాసులు అంతటా విహారం చేస్తూ దర్శనమిచ్చేవారు.

❖ ❖ ❖

వారణాసి మార్గం గుండా ఒక గుర్రపుబండి దౌడుతీస్తున్నది. గుర్రాలు అమితవేగంగా పరుగులిడుతున్నాయి. బండిలో కేవలం ఇద్దరు వ్యక్తులు మాత్రమే ఉన్నారు. ఒకడు యజమాని మరియొకడు సేవకుడు. యజమాని తన గౌరవప్రతిష్ఠలకనుగుణంగా వెలగల వస్త్రధారణతో ఉన్నాడు.

ముఖకవళికలనుబట్టి అతడు తన గమ్యస్థానానికి వేగంగా చేరాలని ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నట్లు గోచరిస్తోంది.

విపరీతమైన వర్షాలు కురిసి వెలిసిన తరువాత చల్లనిగాలి రివ్వున వీస్తోంది. మేఘాలు చెదిరిపోయాయి. సూర్యభగవానుని ప్రచండ ప్రకాశంతో భూమి వెలుతురుమయమయింది. వాతావరణం ఎంతో మనోహరంగా వుంది. వర్షపునీటితో తడిసి ముద్దయిన వృక్షాలు, లతలు, పూలచెట్లు ఆనందనృత్యం చేస్తున్నట్లున్నది. ప్రకృతి అంతా వింతశోభను సంతరించుకొని ఆహ్లాదకరంగా వుంది.

మార్గమధ్యంలో ఎత్తైన ప్రదేశం కావడంవల్ల గుర్రాల వేగం నెమ్మదించింది. వ్యాపారి బండిలోనుండి ఇవతలకు తలతిప్పి చూడసాగాడు. ఒక బౌద్ధసన్యాసి ఆ మార్గంగుండా తలవంచుకొని నడుస్తూ వుండడంచూశాడు. ఆతని వదనం ఎంతో ప్రశాంతతతో వికసించివుంది. గంభీరంగా దర్శనమిస్తున్న ఆ వ్యక్తిపట్ల వ్యాపారికి పూజ్యభావం కలిగింది. మనస్సులో, "ఇతడెవరో ధర్మపరుడైన మహాత్మునివలె గోచరించుచున్నాడు. సజ్జనసాంగత్యమును విద్యావంతులు పారసమణితో పోల్చుతారు. పారసమణితో లోహం స్వర్ణంగా మారినట్లుగా భాగ్యహీనుడు సజ్జనసమాగములో భాగ్యవంతుడగును. ఈ మహానుభావుడు వారణాసిదిశగా ప్రయాణించదలచిన యెడల ఈ బండిలోనే ఎక్కమని ప్రార్థిస్తాను. నా విన్నపము మన్నించిన ఎడల నాకు సంతోషంతోపాటు ఎంతో మేలు జరుగగలదని తలచెను. వెంటనే బండిని ఆపించి, ఆ మహాపురుషును ప్రణామముచేసి తన బండిలో కూర్చొని ప్రయాణించవలసిందిగా పరిపరివిధాల ప్రార్థించెను. అతడుకూడా కాశీకి వెళ్ళవలసిన వాడే అయినందున బండి ఎక్కి, వ్యాపారితో, "అయ్యా! మీరు నాకెంతో ఉపకారము చేశారు. ఎంతో దూరంనుండి నడచివస్తూ అలసిన నాకు మీరు మీ బండిలో ఎక్కించి ప్రయాణంచేసే భాగ్యం కలిగించారు. దానికి మీకెంతో ఋణపడి వున్నాను. నావంటి సాధువువద్ద మీ కివ్వదగిన వస్తువు యిచ్చి ఋణవిముక్తుడునగుటకు ఏమీ లేవు. అయినా మహాప్రభువు బుద్ధదేవ ఆచార్యుని ఉపదేశానుసారం గ్రహించిన అక్షయభాండారం నుండి కొన్నిసూక్తులు మీకు వివరిస్తాను. కనీసం దానివలన మీ యీ ఋణభారం నుండి కొంతవరకు విముక్తుడనవుతాను, అని పలికెను.

వ్యాపారి యీ మాటలకు ఎంతో సంతోషపడ్డాడు. ఆ సన్న్యాసి మృదుమధురంగా వివరిస్తున్న సూక్తుల రత్నాలను అత్యంత శ్రద్ధాసక్తులతో ఆలకిస్తూ ఆ వ్యాపారి తన్మయుడయ్యాడు. బండిప్రయాణం ఎంతో హాయిగా అనిపించసాగింది. సుమారు ఒక గంటసాగిన పిదప బండి ఒక ఇరుకైన వాగు ప్రాంతానికి చేరింది. ఎడ్లబండి ఒకటి మార్గానికి అడ్డుగా ఆగివుంది. అందువల్ల వ్యాపారి బండి ముందుకు సాగలేక ఆగిపోయింది.

ఆ ఎడ్లబండి దేవలుడనే సామాన్య రైతుది. బండి బియ్యపు బస్తాల మూటలతో నిండివుంది. సాయంసమయంలోగా అతడు కూడా వారణాసి చేరాలని ఆతృతపడుతున్నాడు. నిర్జన ప్రదేశంలో బండి శీలలు వదులై ఒక చక్రం ఊడిపోయింది. ఒంటరిగా వున్న దేవలునికి ఏమి చెయ్యడానికి పాలుపోలేదు. వీలైనంతవరకు సరిచేసే ప్రయత్నాలు వృధాఅయ్యాయి. నీరసపడి కళ్ళు తిరిగిపోతున్నప్పటికి బండిమాత్రం ఇసుమంతయినా కదిలేటట్లు లేదు.

ఎడ్లబండి తన ప్రయాణానికి ఆటంకమయిందని వ్యాపారి గమనించి క్రోధితుడయ్యాడు. తన సేవకుని కిందకు దిగమని, "మనం ఎంతసేపని ఇక్కడ నిరీక్షించాలి. ఆ బియ్యపుబస్తాల మూటలను కిందకు తోసివేసి, ఆ బండిని ప్రక్కకునెట్టివేసి, తన బండిని ముందుకు పోనీయ"మని ఆదేశించాడు. ఆ మాటలు విన్నంతనే రైతు "అయ్యా! నేను ఒక సామాన్య పేదరైతును. కనికరించి కొంతసమయం వేచియుండండి. నా బియ్యపు బస్తాలను క్రిందికి విసిరివేసిన యెడల నాకెంతో నష్టం కలుగుతుంది. విపరీతమైన వర్షాలకారణంగా ఇక్కడ నేలంతా చిత్తడి చిత్తడిగా వుంది. ఇక్కడ వాటిని పడవేస్తే నా బియ్యం పాడవడమే కాక దుర్వాసన పాలవుతాయి. కొద్దిసేపటిలో బండిచక్రం శీల సరిచేసి మీకు దారి సుగమం అగునట్లు చూస్తాను. మీరు మీ బండిని ఎంతో సంతోషంగా ముందుకు నడుపవచ్చు"నని పరిపరివిధాల ప్రాధేయపడ్డాడు. వ్యాపారి రైతుచేసిన విన్నపాలు పెడచెవినపెట్టాడు. సేవకునిపై ఆగ్రహం వెళ్ళగ్రక్కాడు. ఆతడు వెంటనే యజమాని ఆజ్ఞానుసారం బియ్యం బస్తా మూటలను బురదలోనికి నెట్టివేశాడు. ఎడ్లబండిని ప్రక్కకునెట్టి యజమాని బండిని ముందుకు నడిపాడు.

అయ్యో! యీ ప్రపంచంలో బీదవాని కెవరూ సహాయపడరు. ధనవంతులు

స్వలాభాపేక్షతో వ్యవహరించేవారికి ఆ రోజులలో కూడా కొదువలేదు. పేదవారిని రక్షించడానికి బదులు భక్షించి వినోదించేవారే ఎక్కువగా వుండేవారు. ఆ సమయంలో బౌద్ధధర్మభిక్షుకులు అసహాయులను ఆదుకోవాలని సదా ఆరాటపడుతూ వుండేవారు, ధార్మిక వివాదాలతో సమయం వ్యర్థపరచక సాధారణ మానవుల జీవన విధానాలను వీలైనంతవరకు సరిదిద్దాలని పరిపరివిధాల తాపత్రయపడేవారు. మనసా, వాచా, కర్మణా పరోపకార ధర్మబుద్ధి కలిగి వ్యవహరించేవారు. వ్యాపారి బండిని ముందుకు పోనివ్వమని ఆదేశించే సమయంలో బౌద్ధశ్రమణుడు నారదుడు. బండినుండి ఒక్క ఉదుటున దిగాడు.

వ్యాపారితో, "అయ్యా! క్షమించండి. నేను మీ బండిలో ఇకపై ప్రయాణించలేను. వివేకతత్పరతతో మీరు నా ఎడల దయగలిగి బండిలో ఎక్కించుకున్నారు. నా అలసట దూరం అయింది. మీకు ప్రత్యుపకారం చేయాలని కోరిక మిక్కుటమైనది. అయితే అది తీరే అవకాశం, సమయం ఆసన్నమయింది. వ్యాపారి, "మీరు బండి నుండి క్రిందికి దిగిపోతే ఉపకారానికి ప్రతిఫలం ఏవిధంగా చెల్లిస్తారు" అని ప్రశ్నించాడు.

అయ్యా! "రైతు ఎడ్లబండిని ప్రక్కకునెట్టివేసి మనం ముందుకు సాగిపోవాలని మీరు భావించారు. అతను మీకు అత్యంత సన్నిహిత బంధువు. ఆతను మీ పూర్వసంబంధికుడని నేను భావిస్తున్నాను. అందువలన అతడికి తగినవిధంగా సహాయపడి మీ ఉపకారానికి ప్రత్యుపకారం చేయడానికే నేను సంసిద్ధుడనవుతాను. దానివలన అతనికి కలిగే లాభానికి ప్రతిఫలం మీకే దక్కిందని భావించండి. రైతు భాగ్యంతోపాటు మీ మంచితనానికి ఫలితానికి అవినాభావ సంబంధంవుంది. మీరు అతనికి కలిగించిన కష్టానికి, నా భావం ప్రకారం మీకు కూడా ఎంతో నష్టం వాటిల్లింది. అందువలన మీకు మేలు కలగాలనే సదుద్దేశంతో యీ నష్టం నుండి మిమ్ములను రక్షించడానికే యథాశక్తి యీ రైతుకు నేను సహాయపడతాను" అని బౌద్ధ శ్రమణకుడు పలికెను.

వ్యాపారి బౌద్ధశ్రమణకుని మార్మిక వాక్కుల సూక్తి పెడచెవినపెట్టాడు. పైగా అతడు వ్యవహారశూన్యుడుగను, బుద్ధిలేని వానివలె కన్పడ్డాడు.

అటువంటి వ్యక్తిని బ్రతిమలాడిన ప్రయోజనంలేదని వ్యాపారి తన ప్రయాణం ముందుకు కొనసాగించాడు.

❖ ❖ ❖

## రెండవ అధ్యాయం

శ్రమణనారదుడు రైతును సమీపించాడు. అతనికి నమస్కరించి బండి సరిచేయడానికి సహాయపడ్డాడు. ఇరువురూ కలసి తడి, పొడిగా బియ్యం బస్తాలను విడివిడిగా చేసే ప్రయత్నం కొనసాగించారు. ఇద్దరి శ్రమా ఫలించి పనియెంతో తొందరగా పూర్తిఅయింది. రైతు, నా అదృష్టం బాగుండబట్టి అదృశ్యశక్తి శ్రమణుని రూపంలో ప్రత్యక్షమై సహాయపడ్డాడని అనుకోవడంలో ఆశ్చర్యకర విషయంలేదు. అనుకోకుండా దక్కిన సహాయంవలన నా పని సుళువుగా పూర్తికావడం ఎంత అద్భుతమైన విషయం" అని విస్మయ చకితుడయ్యాడు.

భయం భయంగా శ్రమణునితో, "మహాప్రభో! నాకు తెలిసినంత వరకు యీ వ్యాపారి నేనేమీ హాని తలపెట్టలేదు. కారణం లేకుండానే అతను నాకు ఎంతో నష్టం కలిగించాడు. దీనికి కారణమేమై వుంటుంది? అన్నాడు.

**శ్రమణుడు** : "బాబూ యీనాడు నీవు ఏదేని అనుభవిస్తున్నావంటే అది నీ పూర్వకర్మల ఫలమే!

**రైతు** : కర్మమంటే ఏమిటి బాబూ?

**శ్రమణుడు** : మనిషి స్వయంగా ఆచరించే కార్యమే కర్మమంటే అనేక జన్మల కర్మలకు ఒక హారం ఏర్పడుతుంది. అందులో వివిధ రకాలైన కర్మరూప మణులుంటాయి. వర్తమాన కార్యాచరణల వలన వాటిలో పరివర్తనలు కలుగుతాయి. పూర్వజన్మలో ఆచరించిన కర్మల ఫలితం యీ జీవితంలో అనుభవిస్తాము. ఈ జన్మలో ప్రస్తుతం మనం చేసిన కర్మల ఫలితాలను వచ్చేజన్మలో అనుభవిస్తాము.

**రైతు** : అయివుండవచ్చు. అయితే గర్వంతో సంచరించే దుష్టమానవులు మావంటి నిరపరాధులను బాధించిన యెడల ఏంచేయాలి?

**శ్రమణుడు** : నా ఊహాప్రకారం నీ ఆలోచనలు వ్యాపారి ఆలోచనలు ఒకేవిధంగా వున్నాయి. పూర్వకర్మల ఫలితంగా ఆతడు ధనవంతుడు నీవు సామాన్య రైతువు. బాహ్యదృష్టితో చూస్తే ఎంతో అంతరం కన్పడుతుంది. నిశితంగా పరిశీలించినపుడు భేదమేమీ గోచరించదు. మానవ స్వభావాలను పరిశీలించిన అనుభవంతో చెబుతున్నాను. ఒకవేళ నీవు వ్యాపారి స్థానంలో వుండి, నీకు కూడా బలశాలియైన సేవకుడు ఉండి, నీ బండికి అడ్డుగా దారిలో అతడి బండి ఆగితే నీవు కూడా అతను చేసిన విధంగానే ప్రవర్తించేవాడివి. అతని బియ్యంబస్తాలు నాశనం అయినా, ఇతరులకు హాని, బాధ కలిగించడు. తప్పని నీవు ఆలోచించే వాడివికావు. ఆ సమయంలో తప్పొప్పుల జ్ఞానం నీకు వుండదు.

**రైతు** : ప్రభూ! మీరన్న ప్రతిమాట సత్యమే! ఆ సమయంలో నేను అలాగే ప్రవర్తించే వాడినేమో! అయితే నాకు మీ దర్శనభాగ్యం కలిగింది. నిస్వార్థంగా ఫలాపేక్ష నాశించకుండా నాకు మహోపకారం చేశారు. మీవలన నా సొత్తు రక్షించుకొని బండిని సురక్షితంగా నడపగలుగుతున్నాను. నేటినుండి మీరు బోధించిన విధంగా ఆదర్శవంతంగా వుంటూ మున్ముందు మానవ బంధువులకు మేలు కలిగేలా సేవచేస్తాను.

రైతు ఎడ్లబండి ప్రయాణానికి సిద్ధమైంది. కొద్దిదూరం సాగిన తరువాత ఎడ్లు రెండు హఠాత్తుగా ఆగిపోయాయి.

**రైతు** : మహాప్రభో! ఎదురుగా పాము వంటిది ఏదో కనపడుతున్నది. శ్రమణుడు పరీక్షగా చూడగా ఏదో సంచి వంటి వస్తువు కన్పడింది. దగ్గరగా పోయి పరీక్షగా చూడగా బంగారు మొహరీలతో నిండివున్న సంచి అది! అది తప్పక వజ్రాలవ్యాపారిదే అయివుంటుందని తలచాడు. ఆ సంచి తీసుకుని రైతు దేవలునికి అందించి, వారణాసి చేరిన వెంటనే వ్యాపారి జాడ కనిపెట్టి యథాతథంగా ఆతని సొత్తును అందించమని చెప్పెను. ఆ వ్యాపారి పేరు పాండు అని, సేవకుని పేరు మహాదత్తుడని వివరించాడు. నువ్వావిధంగా చేసిన యెడల ఆతడు నీతో అమర్యాదగా ప్రవర్తించడం వలన పశ్చాత్తాపం చెందుతాడు. సంచి అతనికి అందించి "మీరు నా పట్ల ప్రవర్తించిన తీరుకు నా మనసులో ఏవిధమైన విరోధభావం లేదు. మిమ్ములను మనస్ఫూర్తిగా

క్షమిస్తున్నాను. మీ వ్యాపారం ఎంతోవృద్ధిలోకి రావాలని కాంక్షిస్తున్నాను" అని చెప్పుమనెను.

"నీ భాగ్యం అతని భాగ్యంతో ముడిపడివుంది. అతని వ్యాపారాభివృద్ధితో పాటు నీ అదృష్టం కూడా కలసివస్తుంది" అని పలికెను.

దూరదృష్టితో రైతుకు పరోపకారఫలితాన్ని వివరించిన మరుక్షణం శ్రమణుడు అక్కడ నిలవకుండా తన దారి తాను పట్టాడు. దారిలో, "ఒకవేళ ఆ వ్యాపారి తనకు తారసపడినట్లయితే యథాశక్తి ఆతనికి మంచితనంతో, మేలు చేయ ప్రయత్నిస్తాను. ఉపదేశించి ఆతనిని స్వచ్ఛమైన మనిషిగా మార్పు చెందడానికి తగిన బోధ చేయగలుగుతానని" యోచించసాగెను.

❖ ❖ ❖

## మూడవ అధ్యాయం

వారణాసిలో మల్లిక్ అనే దళారి వ్యాపారి వుండేవాడు. రత్నాల వ్యాపారి పాండుకు సహమిత్రుడు. వారణాసి చేరిన వెంటనే అతడు తన సమస్య వివరించాడు.

**మల్లిక్** : మిత్రమా! నేనొక గొప్ప చిక్కుసమస్యలో ఇరుకునపడ్డాను. నీతో నా వ్యాపారసంబంధాలు బెడిసికొడతాయేమోనని ఆందోళనగా వుంది. మహారాజు వినియోగానికిగాను మేలురకమైన బియ్యం అందించగలనని మాట యిచ్చాను. రేపటితో గడువు ముగియనున్నది. మాట తప్పక రేపు ఉదయమే బియ్యం సరఫరా చేయాలి. కాని నేనేం చేయగలను? ప్రస్తుతం నా వద్ద బియ్యపుగింజ అనేది లేదు. నా ప్రత్యర్థి వ్యాపారి ఎంతో పలుకుబడిగల బలవంతుడు. రాజభండారి వద్ద వస్తుమార్పిడి పద్ధతిలో వ్యాపారం ఏర్పాట్లు జరిగినట్లు తెలుసుకుని వెంటనే అధికధర చెల్లించి పట్టణంలోని బియ్యపు వర్తకుల వద్ద సరకు అంతా ఖరీదు చేశాడు. రాజభండారికి లంచం యిచ్చి వశం చేసుకున్నాడని తెలియవచ్చింది. రేపటి నా పరిస్థితి ఏమౌతుందో యేమోనని ఆందోళనగా వుంది. నా పరువు ప్రతిష్ఠ మంటకలిసేలా సర్వనాశనమవుతాను. మరణమే నాకు శరణ్యం. అన్నా! భగవంతుని కృపాకటాక్షాలవలన ఎక్కడినుండైనా బండెడు మేలిరకపు

బియ్యం లభించినట్లయితే నేను రక్షించబడతాను. అన్యథా నాకు మృత్యువే గతియని అనుకోవాలి" అన్నాడు.

మల్లిక్ మాటలు విని పాండు వ్యాపారి ఒక్కసారిగా ఉలికిపడ్డాడు. బండిలోని ఇతర వస్తువులతోపాటు దాచివుంచిన తన సంచి గుర్తుకు వచ్చింది. వెంటనే ఇల్లు చేరాడు. బట్టలు ఇతర వస్తువులు వెదకసాగాడు. బండి అంతా చిందరవందర చేసినప్పటికీ తన సంచి లభించలేదు. అతనికి తన సేవకుడు మహాదత్తునిపై అనుమానం కలిగింది. వెంటనే రక్షకభటులకు ఫిర్యాదు చేశాడు. వారు వచ్చి మహాదత్తుని బంధించారు. నిరపరాధిని అపరాధిగా నిరూపించడానికి మహాదత్తుడికి దేహశుద్ధి చేశారు. మహాదత్తుడు బిగ్గరగా రోదిస్తూ గద్గద స్వరంతో 'అయ్యో! నేను నిరపరాధిని. నిజం చెబుతున్నాను. సంచి దొంగిలించలేదు. నాపై కనికరించండి. యజమాని ఆజ్ఞ ప్రకారం దారిలోని నిస్సహాయ బీదరైతును హింసించాను. ఆ పాప ఫలితమే నాకు యీ గతి పట్టింది. రైతన్నా! నీవు యీ జగత్తుకు తండ్రివంటివాడివి. కారణం లేకుండా నిన్ను హింసించినందుకు నాకీ శిక్ష పడవలసిందే!

అని అనేకవిధాల మహాదత్తుడు పశ్చాత్తాపపడసాగాడు. అయితే రక్షకభటులు అతని గోడు వినిపించుకోలేదు. వారికి తెలిసిందల్లా అతనిని బాగా దండించడమే! మహాదత్తునికి దేహశుద్ధి జరుగుతున్నది. అదేసమయంలో రైతు దేవలుడు అక్కడికి వచ్చాడు .పాండు వ్యాపారికి మొహరీల సంచి అందించాడు. అందరూ ఎంతో ఆశ్చర్యపడ్డారు. వ్యాపారి పాండుకు నోటమాట పెగలలేదు. ఎవరినైతే నిష్కారణంగా ఆపదలోకి నెట్టాడో అదేవ్యక్తి స్వయంగా వచ్చి తనను ఘోరవిపత్తునుండి గట్టెక్కించాడు. గద్గద స్వరంతో మాట రాక నిశ్చేష్టుడైపోయాడు. తేరుకుని పశ్చాత్తాప హృదయంతో రైతు దేవలుని క్షమించమని ప్రాధేయపడసాగాడు. సహజంగానే సరళహృదయుడైన రైతు మహానుభావుడైన శ్రమణకుని బోధనవలన మరింత ఉదారుడైనాడు. మనసారా వ్యాపారిని క్షమించి అతని ఉన్నతికై ప్రార్థించాడు.

మహాదత్తుడు విడుదలైనాడు. తన యజామని వైఖరిపై ఆగ్రహం చెందాడు. ఒక క్షణంకూడా అక్కడ నిలువక ఎంతో దూరం వెళ్ళిపోయాడు. దేవలుని వద్ద మేలురకపు బియ్యం వున్నవని తెలుసుకున్న మల్లిక్ రెట్టింపుధర

చెల్లించి కొనుగోలు చేశాడు. ఈ విధంగా అతని సమస్య పరిష్కరించబడింది. రాజభాండారంలో ఉదయమే బియ్యం చేర్చబడింది. అతని గౌరవప్రతిష్ఠలకు భంగం వాటిల్లలేదు. దేవలుడు కలలోగూడా తన బియ్యానికింత మద్దతుధర పలకగలదని ఊహించలేదు. ఆశించని లాభం కలిగిన అమితానందంతో తన గ్రామానికి పయనమయ్యాడు. ఇంక పాండు వ్యాపారి, దేవలుడు సరియైన సమయంలో వచ్చి మహోపకారం చేయబట్టి తన స్నేహితుడు మల్లిక్‌ను ఆపదనుంచి గట్టెక్కించగలిగాను. గట్టెక్కించకపోతే ఫలితం ఏమైవుండేదో అని పరిపరివిధాల యోచించసాగెను. అతనెంత నిజాయితీపరుడో కదా! ఇదంతా శ్రమణ మహాశయుని సమాగమం యొక్క శుభపరిణామమే! లోహాన్ని స్వర్ణమయం చేయడానికి పారసమణికన్నా శక్తివంతమైనది మరేదీలేదు. పాండు వ్యాపారి హృదయం రోదించసాగింది. ఆ మహాత్ముని దర్శించుకోవాలనే కోరిక ప్రబలం కాసాగింది. ఆందోళన చెందిన మనసుతో ఆతనిని కలుసుకోవాలని వెదకనారంభించాడు. బౌద్ధవిహారాలలో అతని జాడకై అన్వేషిస్తూ చిట్టచివరకు కలుసుకోగలిగాడు.

అంతఃకరణతో కృతజ్ఞతాపూర్వకంగా శ్రమణునికి సాష్టాంగ దండప్రణామం చేశాడు. నిర్దయ పాషాణహృదయుడైన వ్యాపారి కుసుమకోమల మహాత్ముని దర్శించినంతనే నిర్మలహృదయుడైనాడు. నోటమాట పెగలలేదు. ఆనందంతో ఆతని హృదయం ఉప్పొంగింది. మహాత్ముడు అతనిని శాంతపరచి అన్నివిధాలా అనునయించాడు.

**శ్రమణుడు** : శేఠ్‌జీ! కర్మరచన యెంత బలవత్తరమైనదో చూశావా?

**పాండు** : మహానుభావా! నాకైతే ఏమీ బోధపడడంలేదు.

**శ్రమణుడు** : ప్రస్తుతం మీకు ఏమీ అర్థంకాదు. సాధారణ ప్రజలకు ఇందులోని మర్మం బోధపడదు. మీ మనసులో కోరిక ప్రబలంగా కలిగి, ఉత్కంఠ పెరిగినపుడు యీ విషయాలు వాటంతట అవే బోధపడతాయి. ఇతరులకు దుఃఖం కలిగించాలని అనుకున్నప్పుడు మనలో మనం యీ విధంగా ప్రశ్నించుకోవాలి. ఒకవేళ అదేపరిస్థితి నాకెదురైతే నాపై ఎటువంటి ప్రభావం కలుగగలదా యని తప్పక యోచించాలి. నేను దీనిని సహించగలనా? ఒకవేళ సమర్థించుకోలేనప్పుడు ఇతరులకు దుఃఖం కలిగించాలనే కోరిక ఎందుకు? అనే యోచనను నశింపచేయాలి. అదేవిధంగా ఎవరేని మనకు

సేవ చేస్తే మనకెంతో బాగుంటుంది. అదేవిధంగా మనసేవ ఇతరులకు ఆనందం కలుగుతుంది. సేవాభావం కలిగిన యెడల ఇతరులకు సేవ చేసే అవకాశం చేజేతులా వదులుకోకూడదు. నేడు మనం నాటిన సుకృతమనే బీజం తాలూకు సత్ఫలితాలు కాలాంతరములో తప్పక దక్కగలవనే విశ్వాసంతో ఎదురుచూడాలి.

**పాండు** : మహారాజా! మీ అమృతవాక్కులు పదేపదే ఎంత విన్నా నా మనసుకు తనివితీరడంలేదు. నా జీవితం చరితార్థం అయి మనసు దృఢపరచుకోవాలని ఉంది మరికొంచెం వివరించండి. కర్మమార్గపుగతి విధానం యింకా తెలుసుకోవాలని కోరికగా వుంది.

**శ్రమణుడు** : మంచిది. అలాగే వినండి. కర్మభేదం తాత్పర్యం వివరిస్తాను. మనిద్దరిమధ్య తెర అడ్డుగా వుంది, దానినే మాయ తెర అంటారు. మాయ తెరవలన మీరు నన్ను నేను మిమ్ములను పరాయివారుగా భావిస్తున్నాము. వేర్వేరు కారణాలవలన సమీప మానవబంధువులతో మీకెంత దగ్గరితనముందో గ్రహించలేకున్నారు. నిజం చెప్పాలంటే ఒక శరీరంలోని భిన్నభిన్న అవయవాలలో ఒకదానికొకటి ఎంత సన్నిహిత సంబంధం వుంటుందో అదికాకుండా దానికన్న అధికమైన అనుబంధం మానవునికి మానవునికి మధ్య వుంది. ఈ విధానాన్ని బహుకొద్దిమంది మాత్రమే గ్రహించగలుగుతారు. యీ సత్యాన్ని గుర్తెరిగి దాని ననుసరించి వ్యవహరించడమే మానవజీవన కర్తవ్యం. యీ సత్యాన్ని ప్రాప్తించుకునే మూడు దివ్యమంత్రాలను మీకు ఉపదేశిస్తాను. మీ హృదయంలో నిక్షిప్తం చేసుకొని మననం చేస్తూవుండండి.

1. ఇతరులకు దుఃఖం కలిగించేవారు తమకు తామే దుఃఖబీజం నాటుకుంటారు.
2. ఇతరులకు సుఖం కలిగించేవారు తమకొరకు సుఖమనే బీజాన్ని నాటుతారు.
3. సమస్తమానవజాతి ఒకటే! భిన్నత్వమనే ఆలోచన కేవలం భ్రమమాత్రమే.

యీ మూడు విషయాలపై దీర్ఘాలోచన చేయండి. సదా వాటిని స్మరిస్తూ వుండండి. సత్యదర్శనమార్గం మీకు తప్పక లభిస్తుంది.

**పాండు** : ప్రభూ! మీ బోధనలు నా హృదయంపై ఎంతో ప్రభావం

చూపాయి. మీరు వచించిన వాక్కులు స్వయంగా మీ జీవితానికి ప్రతిబింబం వంటిది. వారణాసి మార్గమధ్యంలో కేవలం ఒక గంట మాత్రమే నేను మిమ్ములను బండిలో కూర్చుని ప్రయాణించమన్నాను. దానివల్ల నేనేమీ ధనం వెచ్చించలేదు. అయినా ఇంతలో ఎంత మార్పు? ప్రభూ! మీరు నాపై అపార కృపాకటాక్షాలు ప్రసరించారు. స్వయంగా మీరే దేవలుని పంపి నా మొహరీల సంచి నాకు అందేటట్లు చేశారు. ఒకవేళ అవి నాకు చేరే ప్రాప్తం లేనియెడల ఇక్కడ నా బేరం సాధ్యపడేదికాదు. మీ దూరదృష్టి నేనేవిధంగా శ్లాఘించను? దేవలునికి సహాయపడి త్వరగా వారణాసి చేరి నా మిత్రుడు మల్లిక్‌ను ఆదుకున్నారు. అతడి గౌరవం ఆ విధంగా నిలబడింది. నా సేవకుడు మహాదత్తుడు రక్షింపబడ్డాడు లేనియెడల వానిగతి యేమై వుండేదో కదా!

మహారాజా! మానవమాత్రులందరూ మీవలె సత్యదర్శనం చేసినట్లయితే ప్రపంచమంతా శాంతిసౌఖ్యాలతో సుఖవంతమవుతుంది. అసంఖ్యాక పాపాలు నశించి పుణ్యప్రణాళికలు ఆచరణయోగ్యమవుతాయి. మీ వంటి సాధుజనులసేవ చేయాలని నా మనసులో సంకల్పించాను. కౌశాంబీ నగరంలో ఒక విహారాన్ని ఏర్పాటు చేయదలచాను. అచట తమవంటి శ్రమణులు ప్రజలను సన్మార్గమువైపు నడిపించగలరని భావిస్తున్నాను.

❖ ❖ ❖

## నాల్గవ అధ్యాయం

వజ్రాలవ్యాపారి పాండు తలపెట్టిన బౌద్ధవిహారం సర్వవిధాలా నిర్మాణం జరిగింది. వేలకొలది విద్వాంసులు దయాస్వరూపులైన బౌద్ధశ్రమణకులు ఆ విహారమున నివసించసాగారు. అనతికాలంలో యీ విహారం ఖ్యాతి దూర తీరాలకు విస్తరించి ప్రాముఖ్యతను సంతరించుకుంది. ధర్మపిపాసులు సుదూర ప్రదేశాలనుండి అక్కడకు వచ్చి జ్ఞానతృష్ణను తనివితీరా తీర్చుకునేవారు.

వజ్రాలవ్యాపారి పాండు ప్రసిద్ధ వర్తకులలో ఒకడుగా ప్రసిద్ధి చెందగా అతని ఖ్యాతి కథలుగా దూరప్రాంతాలకు విస్తరించింది.

కౌశాంబికి సమీపాన ఒక రాజు రాజధాని వుండేది. ఒకనాడు రాజు తన

కోశాధ్యక్షుని దగ్గరు పిలచి, వెంటనే నాకు ఒక స్వర్ణకిరీటం సిద్ధం కావాలి. యీ ప్రపంచంలో ఎవ్వరూ ఊహించని విధంగా వెలకట్టలేని బహుమూల్య రత్నాలు పొదిగినదై వుండాలని కోరికగా వుంది. రత్నాల వ్యాపారి పాండు తప్ప ఇంతటి మహత్కార్యాన్ని సాధించలేరని నా విశ్వాసం. శీఘ్రమే పాండు వ్యాపారికి కిరీటం తయారు చేయమని ఆహ్వానించండి అని ఆదేశించాడు. రాజశాసనం ప్రకారం పాండు వ్యాపారికి కోశాధ్యక్షుడు సూచనలందించాడు.

నిర్ణయించిన గడువునాటికి కిరీటం పూర్తికావచ్చింది. అదీకాక వ్యాపారి తన సర్వసంపదనూ పెట్టుబడిగా పెట్టి, వజ్రాలు, మాణిక్యాలు, వెండి, బంగారంతోను అనేకరకాల ఆభరణాలను, నగల నమూనాలను తయారుచేశాడు. అన్నీ సిద్ధంచేసుకొని రాజధానికి పయనమయ్యాడు. పదిహేను నుండి ఇరవైమంది వరకు బలశాలులైన రక్షకులతో ప్రయాణం కొనసాగించాడు. రాజ్యంలో తన సంపదతో సిద్ధమయిన ఆభరణాలు అమ్ముడయితే వచ్చే లాభాలతోపాటు కీర్తిప్రతిష్టలు మరింత వృద్ధికాగలవన్న విశ్వాసంతో సంతోషంగా వున్నాడు. అయితే మార్గమధ్యంలో అరణ్యంగుండా ప్రయాణిస్తున్న తరుణంలో బందిపోటు దొంగలగుంపు అడ్డగించింది. అందులో ఏభై నుండి అరవై మంది దాకా వున్నారు. వారు వ్యాపారిని లూటీ చేశారు. వ్యాపారితోనున్న రక్షకులు ఎంతో ధైర్యంగా ఎదుర్కొన్నారు. అయితే చివరకు బహుసంఖ్యాకులైన దొంగలదే పైచేయి అయింది. రత్నాల వ్యాపారి సర్వమూ సంగ్రహించి ఎక్కడి వారక్కడే అదృశ్యమయ్యారు.

అంతానాశనం! క్షణకాలం క్రితం లక్షలకధికారి రత్నాల వ్యాపారి సర్వం కోల్పోయి పేదవాడయ్యాడు. అతని ఆశలన్నీ బూడిదపాలయ్యాయి. క్షణకాలం చేష్టలుడిగినవాడై నిర్విణ్ణుడయ్యాడు. గతంలో చేసిన పాపాలన్నీ గుర్తుకువచ్చి పశ్చాత్తప్తుడయ్యాడు. యవ్వనంలో చేసిన దుష్టచేష్టలన్నీ కళ్ళముందు గిర్రున తిరిగాయి. ఏ బీజాలు నాటాడో వాటి ఫలాలను అనుభవిస్తున్నాడు. కళ్ళముందు మాయ తెరలు మాయమయ్యాయి. గతంలో స్ఫురణకు రాని నిజాలు ఎన్నడూ అనుభవించనివి ఇప్పుడు స్వయంగా ఫలితాన్నిస్తున్నాయి. పశ్చాత్తాపమనే అగ్నివలన పునీతుడైనాడు.

తన అభాగ్య స్థితిపై పాండుకు నేడు ఎటువంటి ఖేదమూ కలగడంలేదు. అయితే ధనంద్వారా ఇతరులకు మేలు చేయాలనే సంకల్పం నెరవేరక

పోవడమనే విషయమై ఎక్కువ విచారించాడు. శ్రమణకుల సేవచేస్తూ వారిద్వారా ధర్మప్రచార కార్యక్రమాలకు ఆటంకం కలగగలదని విచారించాడు.

❖ ❖ ❖

## ఐదవ అధ్యాయం

కౌశాంబీ నగరం సమీపంలో ఒక అరణ్యం వుంది. వ్యాపారి పాండును దోపిడీ చేసినది యీ అడవిలోని క్రూర బందిపోటు దొంగలు అదే మార్గంలో నేడు ఒక బౌద్ధసాధువు నడుస్తున్నాడు. వారి ఆలోచనలో వారు నిమగ్నులై ఆనందిస్తున్నారు. చేతిలో కమండలం చిన్నమూటలో హస్తలిఖిత గ్రంథములున్నవి. మూట విలువైన వస్త్రంతో కప్పబడివుంది. శ్రద్ధాళుడైన భక్తుడెవరో పూజ్యభావంతో పులకితుడై ఆ గ్రంథాలను కప్పడానికి యిచ్చినట్లుగా తోస్తోంది. ఆ విలువైన వస్త్రమే సాధువు ఆపదకారణమైంది. దొంగలు దూరంనుండే మూటను చూసి అందులో విలువైన వస్తువులున్నవని భావించి సాధువుపై విరుచుకుపడ్డారు. మూటవిప్పి చూడగా అందులోనుండి కొన్ని పత్రాలు మాత్రం కన్పడినంతనే వారి క్రోధము పట్టరానిదయింది. అందరూ చుట్టుముట్టి పిడికిళ్ళతో సాధువును బాగా కొట్టి హింసించి పారిపోయారు. సాధువు దెబ్బలకు అలసిపోయాడు. శరీరం బాధతో మూలగసాగింది. అక్కడనుండి కదలలేకపోయాడు. తెల్లవారగానే ఎంతోకష్టపడి ముందుకు సాగే ప్రయత్నంచేశాడు. కొంతదూరం వెళ్ళాడో లేదో పొదలనుండి ఆయుధాల శబ్దాలు, అరుపులు, కేకలు వినబడ్డాయి. మెల్లమెల్లగా అక్కడకు చేరాడు. గతరాత్రి తనను అడ్డగించిన దోపిడీదొంగలు వారిలో వారు తగవులు పడుతున్నారు. అందులో ఒకడు బలాఢ్యుడు. వేటకుక్కలపై సింహం గర్జించి విరుచుకుపడ్డట్లుగా ఆతడు ఇతర దొంగలతో కలియబడి పోట్లాడాడు. విరోధులసంఖ్య ఎక్కువై ఒంటరివాడైపోయాడు. అందరూ కలసి ఒక్కసారి దాడిచేయడంతో గాయాలతో నేలపై ఒరిగాడు. అతడ్ని ఒంటరిగా వదలి మిగతావారు పారిపోయారు.

శ్రమణుడు దగ్గరగాపోయి చూడగా పదిపదిహేను శవాలు పడివున్నాయి. వారిలో బలాఢ్యుడైన వ్యక్తి కొనవూపిరితో కొట్టుమిట్టాడుతున్నాడు. సాధువు హృదయం ద్రవించిపోయింది. నిరర్థకమైన యీ హత్యాకాండకు ఎంతో దుఃఖితుడైనాడు. సమీపంలో సెలయేరు ప్రవహిస్తున్నది. నీరు ఎంతో

నిర్మలంగావుంది. తన కమండలంలో నీటిని తెచ్చి దొంగ ముఖంపై కొద్దికొద్దిగా చిలకరించాడు. కళ్ళు తెరిచిన దొంగ, "విశ్వాసంలేని కుక్కలు ఎక్కడికి పారిపోయారు? పలుమారులు నా ప్రాణాలకు తెగించి వీరందరినీ రక్షించాను లేనియెడల ఎప్పుడో వీరందరూ ప్రాణాలమీద ఆశలేనివారే. ఎప్పుడో మృత్యువు పాలయేవారు అవన్నీ వీరికెందుకు గుర్తుకు రావు. అన్నీ మర్చిపోయారా? అని తనలోతాను అనుకోసాగాడు.

**శ్రమణుడు** : అన్నా! "ఆ పాపమయ జీవన సహచరుల గురించి ఆలోచించకు, ఇప్పుడు ఆత్మవిచారం గూర్చి ఆలోచించు. చివరి క్షణాలైన ప్రశాంతంగా వుండి మార్పు తెచ్చుకో. కొద్దిగా నీరు త్రాగు. ఎక్కడ దెబ్బలు తగిలి గాయమైందో నన్ను చూడనీ. వీలయినంత సహాయంచేసి నిన్ను రక్షించడానికే ప్రయత్నిస్తాను. ఊరట చెందుము" అన్నాడు.

దొంగ శాంతించాడు. అతని గాయాలన్నీ శ్రమణుడు నీటితో శుభ్రంగా కడిగాడు. అడవిలోనుండి మూలికలను వెదికి ఆకుపసరులను గాయాలపై పిండాడు. దీనితో దొంగకు ఎంతో బాధ తగ్గి, నిద్రలోకి జారాడు.

తెలివివచ్చి లేచి ఎంతో స్వాంతన పొందాడు. దగ్గరగా కూర్చొనివున్న శ్రమణుని చూశాడు. హృదయ పరివర్తన కాజొచ్చింది.

దయామయా! "ఇంతవరకు నేను నీచకార్యాలే చేశాను. ఎన్నడూ ఎవరికీ ఉపకారమనేది చేసి ఎరగను. సదా పాపకార్యంలోనే మునిగి తేలేవాడిని. దీనికి అంతంలేదు, నేడు యీ నరకకూపంలో ఇరుక్కున్నాను. బయటపడే మార్గం వుందని అనుకోను. నరకవాసమే నాకు గతి, మోక్షం ప్రాప్తించే భాగ్యం వుండదేమో!

**శ్రమణుడు** : అవును బాబూ! నువ్వు పలికినదంతా సత్యమే! స్వయంగా నీవు చేసిన కర్మల ఫలితాలను కూడా నీవే అనుభవించాలి. నీవు తీసిన గోతిలో నీవే పడతావు. మార్గాంతరం లేదు. అయినా నిరాశపడవద్దు. ఇకనైనా సత్కర్మబీజాలను నాటుకో దానివలన చెడ్డఫలితం అనుభవించవు. పశ్చాత్తాపపడే క్షణాలు దరిచేరనీకు. హృదయం నిర్మలమై దుష్టయోచనలు దూరమవుతున్నకొద్దీ శారీరక సంబంధమైన మమకారము విషయలాలసలు నశించును. దీనికి తగిన వ్యాఖ్యానం నీకు విన్పిస్తాను. విన్నతర్వాత ఇతరులకు మంచిచేయడంలోనే నీకు మంచిలాభం కలుగుతుందదని తెలుస్తుంది. వేరేవిధంగా చెప్పాలంటే స్వయంగాచేసిన కర్మలే ఇతరుల సుఖానికి మూలమని

గ్రహించు. "క్రదంతుడనే గొప్ప గజదొంగ వుండేవాడు. అతడు తన పాపాలకు ప్రాయశ్చిత్తం చేసుకోకుండా చనిపోయాడు. దాని ఫలితంగా నరకం ప్రాప్తించింది. కల్పాంతరాలవరకు కర్మఫలం అక్కడే అనుభవించాడు. అయినా అతనికి ఫలితమేమీ దక్కలేదు. ఆ సమయంలో బుద్ధభగవానుడు అవతారం దాల్చాడు. అతని పుణ్యకిరణాలనుండి ఒక ఆశాకిరణం నరక లోకంలో ప్రసరించడంవలన అక్కడి వారందరూ తమకు త్వరలోనే విముక్తి లభించగలదని ఎంతో ఆశతో ఎదురుచూడసాగారు. అమితప్రకాశకిరణాలు చూసి క్రదంతుడు, ఓ భగవంతుడా! నాపై దయచూపి రక్షించండి. నేను ఇచట వర్ణించనలవి కాని దుఃఖంతో పీడితుడనై యున్నాను. నన్ను యీ సంకటస్థితినుండి విడిపించి విముక్తుని చేయండి ప్రభూ! ఇకపై నేను సదా సత్యమార్గంవైపే పయనిస్తాను. నాకు ముక్తి ప్రసాదించండి" అని రోదిస్తూ ప్రార్థించసాగెను.

"దుష్కర్మలు మానవుని వినాశనానికి దారితీయును. ఇది ప్రకృతి నియమం. సృష్టి నియమానికి కుకర్మలు విరుద్ధము మరియు అస్వాభావికము. ఈ కారణంవల్ల వారి ఆయుష్షు తగ్గుతుంది. సత్కర్మ చేసేవారు దీర్ఘాయుష్షు కలిగివుండడం స్వాభావికం. సదా వారు ఆశాజీవులై మసలుతుంటారు. పాపకర్మాలకు అంతం వుంది కాని పుణ్యకర్మల ఫలితం అనంతం.

"సజ్జగింజల మొలక పెరిగి వేలకొద్దీ సజ్జగింజలు ఉత్పన్నమయినట్లు పంటపొలాలలో అనేక మొలకల పైరు పెరిగి కళకళలాడినట్లుగానే వేలకు వేలు సత్కర్మల సంఖ్యవలన సత్ఫలప్రాప్తి కలుగుతుంది. యీ వ్యవహారక్రమంలో పరంపరాగతంవలన సృష్టి అంతా నిండిపోతుంది. ఇంకా చెప్పాలంటే మంచికర్మలు చేస్తూ చేస్తూ జన్మజన్మకూ కృతార్థుడై దృఢత్వం చెంది అనంతవీరుడను బుద్ధుడుగా మార్పు చెంది నిర్వాణపదము చేరగలడు.

"క్రదంతుని ఆక్రందనలు విని దయాసాగరుడు బుద్ధభగవానుడు ఎన్నడైనా నువ్వు ప్రాణియెడల ఇసుమంతయినా దయజూపినావా? చూపించిన వాడివైతే ఆ దయ నీ వెంట పరుగెత్తి వచ్చి నిన్ను దుఃఖం నుండి విడుదల చేసేది. మనసునుండి దేహంపై మమకారం క్రోధం, కపటం, ఈర్ష్య, లోభ మోహాలు నశించనంతవరకు నీకు ముక్తి లభించదు. క్రదంతుడు సహజంగా క్రూరస్వభావుడు. తనను తాను ఉద్ధరించుకునే మార్గం కానరాక వున్నాడు. అయితే కరుణాస్వరూపుడు. బుద్ధభగవానుడు సర్వజ్ఞుడు. అతని పూర్వజన్మల

కర్మములు ఒకటొకటిగా కదలాడాయి. చూడగా ఒకవంక కొంత దయకలిగింది. క్రదంతుడు తన పూర్వజన్మలో ఒకసారి ఒక అడవినుండి ప్రయాణిస్తున్నాడు. మార్గమధ్యంలో అతనిముందు ఒక సాలెపురుగు సాగుతోంది. అతని మనసులో దానిని త్రొక్కి నలిపివేసి ముందుకు పోదామని యోచించాడు. వెంటనే, "వద్దు వద్దు, ఇదేమి అపరాధం చేయలేదు. అలా చేయకూడదు," అని ఆలోచించిన కారణాన ఆ పాపం నుండి తప్పుకొని సాలెపురుగు ప్రాణాలు కాపాడాడు. అంతే అంత చిన్నపాటి సత్కార్యం మనసులో యోచించి క్రదంతుని విముక్తుని చేయసంకల్పించాడు. బుద్ధభగవానుడు.

అతడును సాలెపురుగును, సాలెగూడువలను నరకానికి పంపెను. క్రదంతునితో "సాలెగూడు వలన అందుకొని దాని సాయంతో పైకి ఎక్కిరా" అని సాలెపురుగు అదృశ్యమయింది. పిమ్మట క్రదంతుడు నిస్సహాయతతో వలనుపట్టుకుని పైకి ప్రాకసాగాడు. మొదట వల ఎంతో బలంగావుంది, రానురాను వల తెగిపోనారంభించింది. నరకంలో బాధననుభవిస్తున్న ఇతరజీవులు సైతం వలను అందుకొని ఎగబాకసాగారు. క్రదంతుడెంతో భీతి చెందాడు. బరువెక్కుతున్న కారణంగా వల వదులుగా సాగిపోసాగింది. నా ఒక్కడి బరువు అది ఆపగలదు గానీ ఏమిటి యిలా అయిపోతున్నది అని యోచన చేస్తూ క్రిందికి దృష్టి సారించాడు. అసంఖ్యాక నరకవాసులు వలను అందుకొని పైకి ఎగబాకడం గమనించాడు. ఇందరి బరువులో వల తప్పక తెగగలదని భావించాడు. భయభ్రాంతుడై ఒకసారిగా, "యీ వలలదారం నాది. మీరు దీనిని వదలండి" అని నోటినుండి వెలువడుతూనే క్రదంతుడు తిరిగి నరకంలో వెళ్ళి పడ్డాడు. "క్రదంతుడికి దేహంపై మమకారం, అహంభావం నశించలేదు. అతను కేవలం తనకు తానే అని భావించాడు. సత్యజ్ఞానం వాస్తవిక స్పృహ అతనిలో లేదు. అంతః కరణము యొక్క సూక్ష్మ సిద్ధి ప్రాప్తించే శక్తి అతనికి తెలియదు. చూడడానికి ఆ శక్తి వలల దారం లాగా సన్నగా వుంటుంది గానీ వేలకొలదీ మనుషుల భారం ఎత్తగలుగుతుంది. అంతేకాక సహాయం చేసే ఉద్దేశ్యంతో ముందుకు సాగినట్లయితే శ్రమ తక్కువ పడుతుంది. ఆ శక్తిని అందుకొనేవారు "ఈ శక్తి కేవలం నాది, సత్యమార్గంలో నడిచే ఫలం నాకు మాత్రమే దక్కాలిగానీ వేరెవరికీ అందులో భాగంగానీ, హక్కుగానీ ఎవరికీ వుండకూడదు అని భావిస్తే వారి అక్షయసుఖం యొక్క దారం తెగిపోయి నారు స్వార్థమనే

లోతైన గుండంలో జారిపోతారు. స్వార్థపరత్వమనేది నరకం నిస్వార్థం స్వర్గం. మన జీవనంలోని గర్వం మమతానుభవాలు స్వచ్ఛ నరకమే! శ్రమణుడు వివరించిన పిమ్మట మృత్యుముఖంలోనున్న గజదొంగ, "మహారాజా! సాలెగూడు వల నుండి దారం అందుకుని అగాధమైన నరకకూపం నుండి శక్తిప్రయోగించి ఇవతలకు వచ్చేవిధంగా నడచుకుంటానని అన్నాడు.

❖ ❖ ❖

## ఆరవ అధ్యాయం

గజదొంగ కొంతసేపటికి శాంతించాడు. మరల స్థిరమనస్కుడై, "పూజ్య మహారాజా! వినండి. మీ సమక్షంలో నా పాపాలకు ప్రాయశ్చిత్తం చేస్తున్నాను. గతంలో నేను కౌశాంబి నగరంలోను సుప్రసిద్ధ రత్నాలవ్యాపారి పాండువద్ద సేవకుడిగా ఉండేవాడిని. నా పేరు మహాదత్తుడు. ఒకనాడు అతను నన్ను క్రూరంగా హింసించాడు. దానితో అతని సేవ వదలి బందిపోటు ముఠాలో చేరాను. క్రమక్రమంగా దొంగలగుంపుకు నాయకుడనయ్యాను. కొద్ది దినముల పిమ్మట వ్యాపారి పాండు ఎక్కువగా ధనము, విలువైన నగలతో రాజుగారిని దర్శించడానికి బయలుదేరాడని తెలిసింది. అరణ్యమార్గంగుండానే ప్రయాణం కొనసాగిస్తాడు. ఆ వార్త నాకెంతో ఆనందం కలిగించింది. నా సహచరులతో పాటు బయల్దేరి అతనిని దోచాను. మీరు కనికరించి అతనివద్దకు పోయి నా అకృత్యమునకై క్షమించమని వివరించండి. ఆనాటి అతని ప్రవర్తనను నేను కూడా క్షమించాను. అతనికి నేను సేవకుడుగా నున్నప్పుడు ధనగర్వంతో మిడిసిపడ్డాడు. పాషాణహృదయుడై వుండేవారు. ఆ సమయంలో అతడు యీ ప్రపంచంలో స్వార్థంతోనే విజయం వుందని గర్వించాడు. ఆతని హృదయమెంతో పరిపక్వత చెంది పరోపకారబుద్ధితో వున్నాడని ప్రజలందరూ ఆతనినెంతో న్యాయపరుడని గౌరవిస్తున్నారని నేటికి తెలియవచ్చింది. అపూర్వ ధనసంపత్తులనేవి సంపాదించుకున్నాడు, అవి ఎవరూ దొంగిలించలేరు, నాశనము చేయలేరు.

"నేటివరకు దుష్కర్మలలోనే నేను మునిగివున్నాను. అయితే ఇక యీ అంధకారమయ జీవనంపై ఇచ్ఛ లేదు. నా ఆలోచనావిధానంలో ఎంతో పరివర్తన గలిగింది. చెడు సహవాస ధోరణులని అంతఃకరణంలో సమూలంగా నాశనం చేసి కడుగుకోవాలి. మృత్యువు సమీపిస్తున్నది. బ్రతికున్న క్షణాలలో

మిక్కుటమైన మంచి ఆలోచనలు దృష్టిలో వుండాలని ఆశిస్తాను. దయాస్వరూపులైన ఓ మహాత్మా! వీలైనంత వేగంగా మీరు పాండువద్దకు పోయి అతనితో దొంగిలించిన సొత్తు రాజకిరీటం, నగలు గతంలో దోచినసొత్తు అంతా సమీపంలోని గుహలో నిక్షిప్తం చేసి వున్నవని అతనిని వెంటనే వచ్చి తీసుకుపొమ్మని చెప్పండి. సొత్తు జాడ తెలిసిన నా సహచరులిద్దరు కూడా మిగిలిలేరు. అందువల్ల ఆ సొత్తంతా భద్రంగా వుంది. చనిపోయేలోగా మంచికార్యం చేసి నా పాపాలను కొద్దిగానైనా ప్రక్షాళనం చేసుకోవాలని ఆశించాను. నా మనసులోని మాలిన్యాన్ని కడిగేసి స్వచ్ఛమైన పిమ్మట మోక్షమార్గంవైపు దారి సుగమం అవుతుందని ప్రార్థిస్తున్నా"నని గుహాప్రాంతం గుర్తులు తెలియజేసి శ్రమణకుని ఒడిలోనే మహాదత్తుడు ప్రాణాలు వదిలాడు.

❖ ❖ ❖

## ఏడవ అధ్యాయం

మహాత్ముడు శ్రమణుడు, కౌశాంబీనగరం చేరి రత్నాలవ్యాపారి పాండుకు విషయమంతా వివరించాడు. వెంటనే పాండు కొంతసైన్యాన్ని వెంటదీసుకుని గుహాప్రాంతానికి చేరాడు. అందులో దాచివున్న సొత్తంతా గాలించితీశారు. మహాదత్తుడు అతని సహచర దొంగల శవాలకు గౌరవపూర్వకంగా అగ్నిసంస్కారం గావించారు. ఆ సమయంలో మహాదత్తుడి చితికెదురుగా భిక్షువు శ్రమణుడు క్రిందివిధంగా ఉపదేశం గావించాడు.

"మనం స్వయంగా చెడుకార్యాలు చేస్తాం, వాటి ఫలితాన్నే మనం అనుభవిస్తాము. ఆ చెడును నిర్మూలించి పరిశుద్ధులవ్వాలి. పవిత్రత, అపవిత్రత అనేవి రెండూ కూడా మన చేతుల్లోనే వుంటాయి. వేరెవ్వరూ మనలను పవిత్రం చేయలేరు. దానిని స్వయంగా ప్రాప్తించుకోవడానికి మనమే స్వయంగా ప్రయత్నించాలి. బుద్ధభగవాముని ఉపదేశవాక్యాలు ఇవి".

ఏ దేవతలూ మనకర్మలను సృష్టించలేదు. దానికి స్వయంగా మనమే బాధ్యులము. సృష్టిలో మాతృగర్భంలోని శిశువువలె మనమందరం కర్మరూపమైన గర్భంలోనుండి జన్మిస్తాము. అవేకర్మలు మనలను నలువైపులనుండి చుట్టుముట్టివుంటాయి. వాటిలో చెడుకర్మలుంటాయి. అవి మనకు శాపగ్రస్తమవుతాయి. మంచికార్యాలు ఆశీర్వాదరూపం అవుతాయి. ఇదేవిధంగా కర్మలలోనే మోక్షప్రాప్తిబీజాలు దాగివుంటాయి.

పొందు సమస్త ధనంసపదను కౌశాంబి చేర్చాడు. ప్రణాళికా బద్ధంగా ఆ ధనాన్ని సదుపయోగం చేయసాగాడు. సొత్తు వినియోగం సక్రమంగా జరిగి వ్యాపారాన్ని మరింతగా వృద్ధిపరచాడు. వ్యాపారంలోని సంపాదనంతా ఉదారంగా సన్మార్గంలో వెచ్చించసాగాడు.

కాలక్రమాన వృద్ధావస్థ సమీపించింది. మృత్యుఘడియలు సమీపించే రోజులు దగ్గరపడ్డాయి. అతను తన సంతానాన్ని దగ్గరకు పిలిపించి, "ప్రియమైన పిల్లల్లారా! ఎన్నడూ నిరాశపడి ఎవరూ కూడా ఏ నాటికీ మంచిపనులను విడవకండి. ఒకవేళ ఏదేని పనిలో మీకు ఫలితం దక్కని యెడల ఆ దోషం మరొకరి మీద రుద్దకూడదు. దుఃఖానికి కారణంకానీ, పనిలోని నిష్ఫలత్వానికి తగిన కారణం. అన్వేషించాలి. ఎందుకంటే వాటిలోనే ఆ కారణం వుంటుంది. వాటిని దూరం చేయాలి. అభిమానం, అహంకారమనే తెరలను తొలగిస్తే మన నిష్ఫలత్వం ఆటంకాల కారణాలు కూడా వాటంతట అవే తొలగి మార్గం సుళువవుతుంది. దుఃఖానికి ఉపాయం కూడా మన చేతుల్లోనే వుంది. మీ కళ్ళముందరి మాయ తెర లేనట్లయితే స్వయంగా నా జీవనవిధానమే మీకు ఆదర్శం. నా జీవితంలోని యీ వాక్యాలు అక్షరసత్యం. సదా వాటిని స్మరించండి.

"ఇతరులకు దుఃఖం కలిగించే వారు తమకు తామే దుఃఖం కలిగించుకుంటారు. ఇతరుల మేలు కోరేవారు తమకు తామే మేలు చేసిన వారవుతారు అని గుర్తించాలి. దేహంపై మమకారమనే మాయతెర దూరంచేస్తే స్వాభావికమైన సత్యమార్గం లభిస్తుంది" యీ వాక్యాలను మననం చేస్తూ వాటి కనుగుణంగానే జీవనం సాగిస్తే మృత్యువు ఆసన్నమైనపుడు మంచికర్మల ఛాయలోనే వుంటారు, జీవాత్మ సుకృతకర్మ ఫలాలతో అమరసుఖం లభిస్తుంది.

❖ ❖ ❖

## భగవత్కృప

### (అడుగడుగువా భగవానుని దర్శించు విధము)

భగవత్కృప సహేతుకము అగునా? కాక నిర్హేతుకమగునా? మానవునకు సర్వావస్థలయందును భగవానుని దయను ఎట్లు దర్శింపవచ్చును? అని ఒక సజ్జనుడు నన్ను ప్రశ్నించెను.

దానికి సమాధానముగా నేను నివేదించు విషయము ఇది - భగవత్కృప యొక్క మహత్త్వమును సమగ్రముగా మాటలతో వర్ణింపజాలము. ఏలయనగా ఆ దయయొక్క మహత్త్వమునకు పరిధులు ఉండవు. మాటలతో చెప్పబడునది బహు అల్పమైనది మాత్రమే యగును. ఆ కృపారహస్యమును ఒకింత తెలిసికొన్నవారు కూడ తాము ఎఱిగినదానిని అయినను పూర్తిగా వివరించలేరు. ఆ కృపమాత్రము ఎల్లవేళల ఎల్ల జీవులమీదను అపారముగా ప్రసరించుచునే యుండును. ఈ విషయములో లోకులకు గల అంచనాలను మించియే ఆ కృప ప్రసరించుచుండును.

నిజము చెప్పవలెనన్న భగవానునిదయ సమస్తప్రాణుల మీదను సర్వదా స్వాభావికముగా, నిర్హేతుకముగా, సమానముగా ప్రవర్తిల్లుచుండును. కాబట్టి దానిని నిర్హేతుకజాయమానమైనదని యెన్నవలయును. కాని యే మానవుడు భగవానుని దయను ఎంతగా విశ్వసించునో, ఆ దయ యెంతగా తనమీద ప్రసరించుచున్నదని భావించునో ఆ దయలోని ఆంతర్యము వానికి అంతగా తెలియవచ్చును. దానివలన వానికి అంతగా లాభముకూడ కలుగును. కావున ఆ దయను సహేతుకమనియు చెప్పవచ్చును. కాని అందు భగవానుని స్వకీయహేతువు ఏదియు ఉండదు.

భగవానుడు సర్వవిధముల పూర్ణకాముడు. సర్వశక్తి సమేతుడు. పరమేశ్వరుడు. అతనియందు ఒక కోరిక, ఒక ఇచ్ఛ యేదియో ఉన్నదని కల్పనకూడ చేయలేము. అతని దయయందు స్వార్థగంధము ఈషణ్మాత్రమును లేదనుట తథ్యము. అతడు స్వాభావికముగా నిర్హేతుకజాయమాన దయాలక్షణలక్షితుడు. సర్వసుహృద్వరుడు. అతని క్రియలు అన్నియు సమస్తజీవుల కల్యాణముకొఱకును ఉద్దిష్టములైనవి. అతడు జన్మరహితుడై యుండియు అప్పుడప్పుడు శిష్టజనరక్షణము, దుష్టజనశిక్షణము, ధర్మసంస్థాపనము, లోకములో తన పవిత్రలీలను విస్తరిల్లజేసి జనులలో ప్రేమను, శ్రద్ధను పెంపొందించుటను లక్ష్యము గావించికొని అవతారధారణము చేయుచుండును. నిర్గుణుడు, నిరాకారుడు, నిర్వికారుడును అయి ఉండికూడ తన భక్తుల ప్రేమకు లోబడి సగుణుడుగా సాకారుడుగా దర్శనము ఇచ్చుటకు బాధ్యుడు అగుచుండును. సర్వేశ్వరుడు, సర్వశక్తిశాలి, సర్వవిధముల సర్వతంత్రస్వతంత్రుడును అయియుండియు భక్తుల ప్రేమచేత హృదయము భగవత్కృపద్రవింప వారికి వశీభూతుడగును. ఈ యన్నిటికిని అతని కారణరహితమైన పరమకృపయే కారణము.

శ్లో. లాలనే తాడనే మాతుర్నాకారుణ్యం యథార్భకే ।
తద్వదేవ మహేశస్య నియంతుర్గుణదోషయోః ॥

బిడ్డను లాలించుటయందు, దండించుటయందును కూడ తల్లికి దానియందు ఉన్న దయయే కారణమగుచుండును. అట్లే జీవుల గుణదోషాలను నియంత్రించునట్టి యా మహేశ్వరుని ప్రతిచర్యకును కూడ అతని కృపయే కారణమగుచుండును.

భగవానుని పడసిన భక్తులు ఆ భగవానుని దయామహత్త్వమును ఎఱిగినవారు అగుదురు. వారిలో దయామయుడైన ఆ భగవానుని దయకు సంబంధించిన యంశము పరివ్యాప్తమై యుండును. ఆ మహాపురుషులకు కూడ ఇతర జీవులతోడ ఎట్టి స్వార్థసంబంధములును ఉండవు. వారి క్రియలు అన్నియు నిస్స్వార్థములై లోకకల్యాణమునకు ఉద్దిష్టములై యుండును. అట్టియెడ భగవానుని దయ హేతురహితము కాక మఱి యేమగును? మహాపురుషులకు ఏ జీవునితోడను ఎట్టి స్వార్థసంబంధమును ఉండదు అను విషయమున భగవానుడు ఏమనెనో చూడుడు!

శ్లో. నైవ తస్య కృతేనార్థో నాకృతేనేహ కశ్చన ।
న చాస్య సర్వభూతేషు కశ్చిదర్థ వ్యపాశ్రయః ॥ (గీత.3/18)

'ఆ మహాపురుషునకు ఈ లోకములో ఒకపని చేయుటతోను పనిలేదు. చేయకుండుటతోను పనిలేదు. సమస్త భూతములయందు అతనికి లేశమాత్రపు స్వార్థసంబంధమైనను ఉండదు.' అయినను అతడు లోకహితమును కోరి కర్మాచరణముచేయుట సంభవము అగును.

ఈ విషయములో కూడ భగవానుడు ఇట్లు చెప్పియున్నాడు.

శ్లో. న మే పార్థాస్తి కర్తవ్యం త్రిషు లోకేషు కించన ।
నానవాప్త మవాప్తవ్యం వర్త ఏవ చ కర్మణి ॥
(గీత. 3/22)

ఓ అర్జునా! నాకు మూడులోకములయందును ఈషణ్మాత్రపు కర్తవ్యమైనను ఏదియును లేదు. నాకు ప్రాప్తవ్యవస్తువు ఏదియును లేదు. అప్రాప్తవ్యమైనది కూడ ఏదియును లేదు. అయినను నేను కర్మాచరణమందు ప్రవర్తిల్లుచునే యుందును.

తులసీరామాయణములో ఒక యెడ తులసీదాసు కూడ ఇట్లు

వర్ణించియున్నాడు. ఓ అసురారీ! నీవు, నీ సేవకుడు - 'మీరు ఇరువురు మాత్రమే లోకములో నిర్హేతుకముగా ఉపకారము చేయువారు. లోకములోని యితరజనులు ఎల్లరును స్వార్థముతోడ మైత్రి చేయువారే. వారికి కలలో కూడ పరమార్థదృష్టి లేదు.'

భగవానునకు, మహాపురుషులకును ఒక కర్తవ్యముకాని, ఒక ప్రయోజనముకాని ఏదియు ఉండదు. అయినను వారు లోకులను పెడత్రోవలు పట్టకుండ కాపాడుటకును, నీతి, ధర్మము, భగవద్భక్తి రూపములో ఉన్న సన్మార్గములో ప్రవర్తిల్లజేయుటకును, కేవలము లోకకల్యాణమును కోరుచూ అన్నిపనులు చేయుచుందురని పై వర్ణనమువలన తెల్లమగుచున్నది. దీనికి అంతకును వారి అపారదయయే కారణము.

భగవానుడు పరమదయాళువు, సర్వశక్తిసమేతుడు అయియుండి కూడ సహృదృష్టి, నిస్పృహత్వము కలవాడైన కారణమున అతనికి తనంతతానుగా ఏపని చేయుటయు సంభవముగాదు. శ్రద్ధాభక్తి పూర్వకముగా తనను శరణుపొందిన భక్తుని హితమును కోరియే అతనియందు క్రియ ప్రాదుర్భవించును. దానితో అతని దయాళుత్వము ప్రకటమగును.

అట్లయిన ఇక్కడ ఒక ప్రశ్న ఉదయించును. అది యేది యనగా భగవానునకు సమస్త జీవులయందును సమానముగా దయయున్నప్పుడు వారికి అందఱకును సమానముగా కల్యాణము ఏల కలుగుటలేదు?' అన్నది ఆ ప్రశ్నము. వివేచనము చేసిచూడగా ఈ ప్రశ్నమునకు యుక్తమైన సమాధానము ఇది - దయలోని ఆంతర్యమును ఎఱుగని కారణమున జనులు ఆ దయవలన లాభమును పొందలేకున్నారు. ఉదాహరణముగా చెప్పవలెనన్న జగత్తును తరింపజేయు భగీరథి యనబడు గంగానది యున్నది చూడుడు! అది లోకకల్యామును కోరియే నిరంతరముగా పాఱుచున్నది. అయినను దాని ప్రభావమును ఎఱుగని కారణమున, అందు తగినంతగా శ్రద్ధాభక్తి విశ్వాసములు లేనికారణమున జనులు అందు స్నానపానములు చేయుటలేదు. దానివలన వారు విశేషలాభమును పొందుటలేదు. ఆ విధముగానే భగవానుని దయాప్రవాహము అహర్నిశమును గంగాప్రవాహముకంటె అధికముగా సర్వత్ర ప్రవహించుచున్నది. అయినను మానవులు దాని ప్రభావమును ఎఱుగని కారణమున ఆ భగవానుని దయవలన విశేషలాభమును పొందలేకున్నారు.

భగవానుని దయవలన గలుగవలసిన సాధారణలాభము మాత్రము ఎల్లజీవులకును సమానముగా ప్రాప్తించుచునే యున్నది. కాని ఆ దయకు పాత్రమైనవాడు అంతకంటె ఎక్కువ లాభమును పొందగలుగును. సూర్యునియెండ, వెలుతురు సర్వత్ర సమానముగానే ఎల్లరకును ప్రాప్తించుచుండును. కావున దానివలన కలుగు లాభము ఎల్లరకును సమానము అనియే చెప్పవలెను. కాని సూర్యకాంతమణిమీద మాత్రము దాని ప్రభావము విశేషముగా ఉండును. సూర్యరశ్మిసోకిన వెంటనే అందు అగ్ని పుట్టుకొని వచ్చును. ఆ సూర్యకాంతమణివలె ఎవని యంతఃకరణము పరిశుద్ధమైయుండునో, ఎవని యంతఃకరణమందు భగవానునిపై అధికశ్రద్ధాభక్తులు ఉండునో అతడు ఆ స్వామియొక్క దయవలన విశేషలాభమును పొందగలుగును.

మానవుల కర్మములు మూడు విధములు. 1. సంచితము (అనేక జన్మలుగా కూడబెట్టబడి ఆదిభూతమై నిలిచియున్నది.) ప్రారబ్ధము (వర్తమాన శరీరముతో ఫలానుభవము ఆరంభింపబడినది.) 3. క్రియమాణము (వర్తమాన శరీరముతో చేయబడుచున్న కర్మలు) ఈ మూడు విధముల కర్మలతోను భగవానుని దయకు సంబంధము ఉన్నది. పురాకృతములైన పుణ్యకర్మముల సంచయము. భగవానుని దయవలననే సంభవమగును. ఆ సంచితకర్మలను అనుసరించియే భగవానుడు జీవులహితమును కోరియే దయాపూర్వకముగా వారికి ప్రారబ్ధభోగమును ఏర్పరచుచుండును. కావున భగవానుని దయారహస్యమును ఎటిగినవాడు ప్రారబ్ధమును అనుభవించు కాలమందు ప్రతిదశయందును అతని దయను దర్శించుచునే ఉండును. క్రియమాణములైన కర్మలు కూడ భగవానుని దయవలననే సంభవములు అగుచుండును. అతని దయవలననే మానవుడు సన్మార్గమందు పురోగమించుట సంభవము అగుచుండును. కావున ఎల్ల కర్మలతోడను భగవానుని దయకు సంబంధమున్నది.

శ్రద్ధాభక్తులతో విచారణము చేయుటవలన ప్రతిక్షణమందు, అడుగడుగున, ప్రతిదశయందును మానవునకు భగవానుని దయ గోచరమగుచుండును. ఎల్ల జీవులకును జలము, వాయువు, ప్రకాశము ఆదిగాగల తత్త్వములవలన సుఖము ప్రాప్తించుచున్నదన్న, వారి జీవన నిర్వహణము సాగుచున్నదన్న, అన్నపానాదిక చర్యలు సాగుచున్నవన్న ఆ యన్నిటియందును భగవానుని దయ సమానముగా పరివ్యాప్తమై ఉన్నది.

మానవుని శుభాశుభకర్మలను అనుసరించి ఫలభోగవిధానము చేయుటలో భగవానుని దయయే ప్రధానముగా పనిచేయును.

ఏ కొంచెము జపసాధన, ధ్యానసాధన, సత్సంగము సాగించినను మానవుని జన్మజన్మాంతరకృతములైన పాపములు అన్నియు నశించిపోవునట్లుగా భగవానుడు చట్టము చేసియుండెను. ఇందు భగవానుని అపారదయ నిండియున్నది.

భగవానుని శరణుపొంది ప్రేమతో దీనముగా ప్రార్థన చేసినమీదట అతడు ప్రత్యక్షముగా ప్రకటమగుట, భక్తుని సమస్తదుఃఖములను, సంకటములను హరించుట, సర్వవిధముల శరణాగతుని సంరక్షించుట, ఎల్లపాపకర్మలనుండియు రక్షించుట (తప్పించుట) ఇవి అన్నియు భగవానుని దయాప్రదర్శన రూపములే. ఎట్టి ఇచ్ఛయు లేకుండ, ఎట్టి ప్రార్థనము చేయకుండ ప్రహ్లాదునివలె దృఢమైన విశ్వాసముతో భక్తిసాధనచేయు భక్తుని హితమును కోరి స్వయముగా ప్రకటమై అతనికి దర్శనము ఒసగుట, ఎల్ల విపత్తులనుండియు అతనిని రక్షించుట అనునది భగవత్కృపకు సంబంధించి అత్యధికమైన విశిష్టప్రదర్శనమగును.

మహాత్ములవలనగాని, శాస్త్రనియమములమూలమున కాని, స్వయముగా జనుల హృదయాలలో ప్రేరణ కలిగించుట మూలముగాగాని, స్వయముగా అవతారధారణము చేసికాని జనులను పాపప్రవృత్తులనుండి మఱలించి పుణ్యకర్మలయందు ప్రవర్తిల్లజేయుట కూడ భగవానుని విశేషదయాప్రదర్శనమే అగును.

దారపుత్ర ధనగృహాదులగు భౌతిక పదార్థముల ప్రాప్తియందు, వాని వినాశమునందు, శరీరారోగ్యము చక్కబడుటయందు, చెడుటయందు, వ్యాధిబాధలు, విపత్కరపరిస్థితులు ప్రాప్తించుటయందు, అది తొలగుటయందు, సుఖసంపదలు కలుగుటయందు, దుఃఖదశలు వచ్చి పడుటయందును కూడ (ప్రతి పరిస్థితియందును) మానవుడు భగవానుని దయను దర్శించుటను అలవరచికొనవలెను.

పత్నీపుత్ర ధనగృహాదులగు లౌకిక పదార్థముల సమృద్ధి కలిగినప్పుడు మానవుడు వానిని అన్నిటిని పరులకు సుఖము కలిగించుటకై, వాని సాయమున ఉత్తమకర్మాచరణము చేయుటకై, భగవత్ప్రేమ పెంపొందించు కొనుటకై, సర్వవిధముల వానిని భగవద్భక్తి సాధనయందు వినియోగించుటకై

మాత్రమే తన పురాకృత పుణ్యకర్మల ఫలముగా భగవానుడు తనకు ప్రసాదించెనని భావించుకొనవలెను. ఇట్లు భావించుకొని ఆ లౌకిక పదార్థములతోడ తన శరీరనిర్వహణము మేరకే యెవడు సంబంధము నిలిపికొనునో, వానిని అన్నిటిని కేవలము భగవత్కార్యమునకే వినియోగించునో అతడే భగవానుని దయలోని ఆంతర్యమును చక్కగా అవగతము చేసికొన్నవాడు అగును. అట్లు కాక ఆ పదార్థములను స్వకీయభోగమునకే వినియోగించు కొనువాడు భగవానుని దయలోని ఆంతర్యమును తెలిసికొన్నవాడు కాడు.

ఈ లౌకిక భోగపదార్థములు అన్నియు నశించిపోయినవేళ మానవుడు తనలో ఇట్లు తలపోయవలయును. 'ఈ లౌకిక పదార్థములందు నాకు భోగబుద్ధి, ఆసక్తి, తగులము కలిగిన కారణమున ఇవి భగవద్భక్తి మార్గమునకు అవరోధములని యెంచి పరమదయా పరతంత్రుడైన భగవానుడు దయావశమున నన్ను తనవంకకు ఆకర్షించుటకై వానిని అన్నిటిని నానుండి దూరము చేసెను' ఇట్లు చేయుటలోకూడ మూలము భగవానుని దయయే. లోకములో మనము చూచుచుందుము. మిడుతలు, తద్విధములైన యితర జీవులును కాంతిని చూచి దానియందు ఆసక్తములగును. మోహవశమున ఎగసియెగసి వచ్చి మంటలలో పడి కాలి బూడిద యగుచుండును. వాని ఆ దురవస్థనుగాంచి దయగల మానవుడు ఎవడైన ఆ కాంతిని అచ్చటనుండి తొలగించి వేయును. మంటలను ఆర్పివేయును. అట్టిపని చేసినవానికి ఆ జీవులమీద విశేషమైన దయ ఉన్నది అనుట నిజము. కాని యీ విషయమును ఆ మిడుతలు ఎఱుగవు. ఆ కాంతిని, మంటలను తొలగించినవాడు అత్యంతనిష్ఠురుడు, నిర్దయుడు, తమపాలిటి శత్రువు అనియే అవి భావించును. ఈ భావనకు వాని అజ్ఞానమే మూలము. అది దాని పొరపాటు. ఈ విధముగానే మన అమాయకసోదరులు పరమేశ్వరుని దయారహస్యమును ఎఱుగక ఈ సమస్త సాంసారిక పదార్థములు అభావమునుగాంచి నానావిధముల భగవానునిపై దోషారోపణము చేయసాగుదురు. కాని భగవానుడు మాత్రము పరమదయాళువు. కావుననే అతడు వారి అపరాధములవంక చూడడు. "నా యందు పరమానుగ్రహమును చూపి భగవానుడు నా పురాకృతపాపకర్మలను అన్నిటిని హరించుటకు, భావికాలమందు మఱల పాపపు ప్రవృత్తులలో పడకుండ చేయుటకును, భోగసామగ్రుల క్షణభంగురత్వమును ప్రత్యక్షముగా చూపి వాని యెడల వైరాగ్యమును ఉదయింపజేయుటకును ఈ సాంసారిక పదార్థములను అన్నిటిని నా నుండి దూరము చేసెను" అని భావించుకొని

యెవడు ఈ భౌతికవస్తువుల వియోగదశయందు కూడ భగవానుని దయను దర్శించి సదా ప్రసన్నత వహించియుండగలుగునో అతడే అతని దయారహస్యమును యుక్తమైన రీతిగా అర్థము చేసికొన్నవాడగును.

ఈ విధముగానే తన శరీరము ఆరోగ్యవంతముగా నున్నవేళ భావన చేయవలసిన విధము - భగవానుడు సర్వవ్యాపియని యెఱిగి సర్వత్ర భగవానుని దర్శించుచు పరులకు సేవ చేయుటకును, సజ్జనసాంగత్యము చేసి భగవానుని గుణప్రభావ తత్త్వరహస్యములను అర్థము చేసికొని సముచితరీతిగా వ్యవహరించుటకును, తన భజనధ్యానాదులు నిరంతరముగా సాగుటకు అనువుగాను భగవానుడు నాయందు దయదలచి నా యీ శరీరమును ఆరోగ్యవంతము గావించెనని భావన చేయవలెను ఇట్లు భావన చేసి యీ క్షణభంగురశరీరమును పరమదయామయుడైన భగవానుని కార్యమునందు పై లక్ష్యము నెఱవేఱుటకై యెవడు వినియోగించునో అతడే భగవానుని దయారహస్యమును సముచితరీతిగా అర్థము చేసికొన్నవాడగును.

శరీరము రోగగ్రస్తమైనప్పుడు భావన చేయవలసిన విధము ఏదియనగా నేను చేసికొన్న పురాకృతపాపకర్మల వలయమునుండి నన్ను విముక్తుని గావించుటకును, భావికాలమందు మఱల పాపములో పడకుండ చేయుటకును, శరీరముపై విరక్తిని పెంచుటకును, రోగాదిబాధల సహనమునందు తపోబుద్ధిని గలిగించి వానివలన తగినంత లాభమును పొందుటకును, మాటిమాటికి తనను స్మరించునట్లు చేయుటకును భగవానుడు నా యెడల పరమానుగ్రహమును చూపి బహుమానముగా నాకు ఈ అవస్థను కల్పించెను అని భావన చేయవలెను. ఈ విధముగా భావన చేసి ఎవడు రోగాదిపీడలు ప్రాప్తించినవేళకూడ ఈపఱ్ఱామాత్రము చింతింపక సానందముగా తన మనమును నిరంతరము భగవచ్చింతనమునందు సంలగ్నము గావించుకొని భగవానుని పై లక్ష్యములను దృష్టిలో నిలిపికొని హర్షమును పొందుచుండునో అతడే యీ పరమపురుషుని దయారహస్యమును సమ్యగ్రీతిగా అర్థము చేసికొన్నవాడగును.

ఈ విధముగానే సుఖవంతులతోకాని, దుఃఖగ్రస్తులతోకాని, మహాత్ములతోకాని, పాపాత్ములతోకాని సంయోగముకాని, వియోగముకాని కలిగినవేళలయందును, వారితోడ ఏవిధమైన సంబంధమైన ఏర్పడిన సందర్భములందును కూడ భగవానుని దయనే దర్శింపవలెను.

ఉత్తమపురుషులను కలిసికొనుట సంభవము అయినప్పుడు వారి గుణములను, ఆ చరణములను అనుకరింపజేయుటకును, వారి ఉపదేశముల మూలమున దైవభక్తిని పెంపొందింపజేయుటకును సదయుడై భగవానుడు తనకు ఈ సదవకాశమును కలుగజేసెనని భావన చేయవలెను.

ఆ సుజనులతోడ వియోగము సంభవించినపుడు ఇట్టి మహానుభావులతోడ సంబంధము ఎల్లకాలము నిలుచుట కష్టము అన్న విషయమును ఎఱుగజెప్పుటకును, అందులకై మఱల ఉత్కటమైన కాంక్ష కలిగించుటకును, వారియందు ప్రేమను పెంపొందింపజేయుటకును దయ వహించియే భగవానుడు వారితోడ వియోగమును కలిగించుచుండును అని భావన చేయవలెను.

దుష్టులతోను, దురాచారులతోను, సంయోగము సంభవించినపుడు దురాచారములవలన గలుగు నష్టములను ప్రత్యక్షముగా చూపి దుర్గుణముల యెడల, దురాచారముల యెడల విరక్తిని పెంపొందించుటకై భగవానుడు ఇట్టివారితోడ సంయోగమును గలిగించుచుండును అని భావింపవలెను.

వారితోడ వియోగము కలిగినప్పుడు దుర్జనసాంగత్యమువలన గలుగు దోషముల బారినుండి రక్షించుటకు భగవానుడు సదయుడై అట్టి దుష్టాత్ములతోడ వియోగమును కలిగించుచుండును అని భావించికొనవలెను.

దుఃఖగ్రస్తులైన మానవులతోను, జీవులతోను సంయోగము కలిగినప్పుడు అంతఃకరణమందు కరుణను పెంపొందింపజేయుటకు, వారికి సేవలు చేయగల సదవకాశమును కలిగించుటకు, సంసారముపై విరక్తి నొదవించుటకును దయామయుడైన ఆ భగవానుడు కృప వహించియే ఇట్టి వ్యక్తులతోడను, జీవులతోడను సంయోగము కలిగించుచుండును అని భావన చేయవలెను.

సుఖవంతులైన వ్యక్తులతోడను, జీవులతోడను సంయోగము కలిగినప్పుడు వీరు అందఱు సుఖపడుచుండగా చూచి సంతోషపడుటను అలవరచికొనుటకై భగవంతుడు దయచేసి వీరితోడ సంయోగమును కలిగించెను అని భావన చేయవలెను.

వీరితోడ ఎడబాటు కలిగినప్పుడు జనసముదాయము మీద ఉన్న ఆసక్తిని దూరముచేసి లోకముపై పరమవైరాగ్యమును జనింపజేయుటకై, ఏకాంతమందు ఉండి భజనధ్యానసాధన దృఢముగా సాగించుటకై సదయుడై భగవానుడు ఈ యవకాశమును కల్పించెను అని భావించవలెను.

ఈ విధముగనే ఇతరములైన ఎల్ల సంఘటనములందు, సర్వకాల సర్వావస్థలయందును భగవానుని దయను దర్శించుచుండవలెను. ఈ విధమైన అభ్యాసమును, సాధనను సాగించి మానవుడు ఎల్ల జీవులమీదను ప్రవహించుచున్న ప్రసరించుచున్న భగవానుని అపారదయాప్రవాహముయొక్క ఆంతర్యమును అర్థముచేసికొని అందువలన విశేషలాభమును పొందవచ్చును.

దయామయుడైన భగవానునకు ఎల్లజీవులయందు ఎంతదయ యున్నదో దానిని అంతను సమగ్రముగా మానవుడు తెలిసికొనజాలడు. మానవుడు స్వబుద్ధిచేత తనమీద భగవానుని దయ యెంతమేరకు అధికముగా ఉన్నదని భావించునో ఆ మేరకు ఆ భావించుటకూడ అతనికి ఎక్కువయే యగును. ఏ మానవుడును కూడ భగవానుని విషయములను యదార్థరూపములో ఊహింపనైననుజాలడు.

జనులు భగవానుని దయాసముద్రుడు అందురు. కాని యా సముద్రోపమానము కూడ నిజమరయగా అతనికి సరియగునట్టిది కాదు. అది అతని అపారదయకు కించిన్మాత్రపు పరిచయము మాత్రమేయగును. సముద్రము పరిమితమైనది. సీమాబద్ధమైనది. భగవానుని దయ అసీమము, అపారమును అయినది. అయినను లోకములో సముద్రము కంటె పెద్దవస్తువు ఏదియు ప్రత్యక్షముగా లేనికారణమున దానితోనే పోల్చి భగవానుని దయామహత్త్వమును బోధించుటకు కవి పండితులు ప్రయత్నించుచుందురు.

ఈ విధముగా ఎల్లజీవుల మీదను భగవానుని దయ అపారముగా ఉన్నను తద్రహస్యమును ఎఱుగని కారణమున మానవులు దానివలన పొందగలుగునంత లాభమును పొందలేకున్నారు. తమ మూర్ఖత్వము కారణముగా నిరంతరము దుఃఖయగ్నులు అగుచున్నారు.

భగవానునకు ఎల్లజీవులయందును ఉన్న దయ అపారము. దాని మహత్త్వమును అపారమే. దానివలన మానవుడు ఎంతలాభమును పొందగోరిన అంతియే పొందగలుగును. భగవానుని దయను, తద్రహస్యమును, తత్త్వమును తెలిసికొనని దశలో ఆ దయ యెల్లరకును సమానముగా సాధారణఫలమును ఒసగుచుండును. దానిని ఎవడు ఎంతగా అర్థము చేసికొనునో వాడు అంతగా అధికఫలమును పొందగలుగును. అర్థము చేసికొని తదనుగుణముగా పని చేయుటవలన అత్యధికఫలము ప్రాప్తించును.

భగవానుని దయయొక్క ప్రభావము ఎట్టిది అనగా దాని రహస్యమును, తత్త్వమును ఎఱిగినవానికి అది పరుసవేదివలె (ఒక మణి, దీనిని తాకిన

ఇనుము బంగారమగును) స్వయముగా కార్యసాధికయగును. అనగా ఒక దరిద్రుని యింట పరుసవేది పడియున్నది అనుకొనుడు! వానికి దాని పరిజ్ఞానము లేదు. దానిని అతడు ఒక సాధారణ శిలగానే భావించుచుండెను అనుకొనుడు! అప్పుడు దానివలన అతడు విశేషలాభమును పొందలేడు. కేవలము ఒక సాధారణశిలగానే ఉపయోగించుకొనుచుండును. ఇట్లుండగా ఒకనాడు అప్రయత్నముగా ఆ పరుసవేదికి ఆకస్మికముగా ఇనుముతో స్పర్శ సంబంధము కలుగుట సంభవమైనచో వానికి అది విశేషలాభమును కూడ కలిగించినది యగును. ఆ అద్భుత చమత్కారమును గాంచి కాని, ఒక గుణజ్ఞుడైన వానివలన తెలిసికొని కాని ఆ శిల సాధారణశిలకాదు, పరుసవేది యని, అతడు దాని గుణమును, ప్రభావమును తెలిసికొనుట సంభవమైనచోఅది వానిచేత విశేషప్రయత్నము చేయించి వానిని పూర్ణఫలమును పొందువానిని గావించును. ఈ విధముగానే ఏదేని ఒక విశేషసంఘటన మూలముగాగాని, ఒక మహాపురుషుని సాంగత్యము కారణముగా గాని మానవునకు భగవానుని దయకు సంబంధించిన రహస్యము, తత్త్వము, ప్రభావము విదితమగుట సంభవమైనచో ఆ జ్ఞానము వానిచేత స్వయంక్రియ చేయించి వానిని పూర్ణఫలభాజనుని కావించును.

భగవానుడు పరమదయామయుడు, సర్వసుహృద్వరుడు అన్న రహస్యమును ఎఱిగిన మానవునకు వెంటనే పరమశాంతి లభించును. భగవానుడు స్వయముగా చెప్పియే ఉన్నాడు.

"సుహృదం సర్వభూతానాం జ్ఞాత్వామాం శాంతి మృచ్ఛతి"

(గీత. 5/29)

ఓ అర్జునా! నా భక్తుడు నన్ను సమస్తభూతములకు సుహృదునిగా అనగా స్వార్థరహితదయాపరతంత్రునిగాను, ప్రేమమయునిగాను, తాత్త్వికముగా తెలిసికొని శాంతినిపొందును.

అట్లు ఏలకాదు? లోకములో మనము ప్రత్యక్షముగా చూచుచునే యుందుము. ఫలానా రాజాధిరాజు లేక సేటు పరమదయాళుడు, శక్తిశాలి, అతడు ఎల్లరయందును దయజూపును. అతడు నన్ను కలిసికొన నెంచుచున్నాడు. నన్ను ప్రేమించగోరుచున్నాడు అని మనకు తెలిసినప్పుడు, వారియందు మీకు దృఢవిశ్వాసము ఏర్పడినప్పుడు మనకు ఎంత ఆనందము కలుగును? ఎంత ఊరట, ఎంత శాంతి ప్రాప్తించును? వారిని కలిసికొని వారి దయవలన లాభము పొందుటకు మనము ఎంతగా ప్రయత్నము చేయుదుము?

ఇట్టి పరిస్థితిలో సర్వశక్తిసమేతుడు, అనేకకోటి బ్రహ్మాండములకు అధిపతియు అగు భగవానుని విషయమున అతడు పరమదయామయుడు. సర్వ సుహృద్వరుడు, అతడు నన్ను ప్రేమించగోరుచున్నాడు, నామీద అతనికి అపారమైన దయ ఉన్నది, అతడు తనను కలిసికొనవెంచువారిని తాను స్వయముగా కలికొనగోరును అన్న దృఢవిశ్వాసము ఎవనికి కలుగునో వాడు ఆ పరమపురుషుని దయవలన పరమ లాభమును పొందుటకు యత్నించుటలోను, అతనికి పరమశాంతి ప్రాప్తించుటలోను ఆశ్చర్యమేమి ఉన్నది? ఈ విధముగా భగవానుని దయారహస్యమును ఎఱిగినవాడు తాను స్వయముగా కూడ పరమదయాళువు, సర్వసుహృదుడును అగును. అట్టివానికి భగవానుడు లభించును. అతడు భగవానునకు అత్యంత ప్రేమపాత్రుడగును. అతడు భగవానునితో ఏకత్వమును పొందును.

ఆ పరమదయాళుడు, సర్వసుహృద్వరుడు, సర్వశక్తిశాలి అగు పరమేశ్వరునకు మనమీద సహజముగనే అపారమైన దయవున్నది. అనుక్షణము ఆ దయవలన మనకు స్వాభావికముగా లాభము కలుగుచున్నది. ఆ స్వామి స్వయముగా అవతారధారణము చేసి ప్రత్యక్షముగా తన దయను ప్రదర్శించివెడలెను. కావున ఆ ప్రభువును లక్ష్యము కావించుకొని మనము అతని దయారహస్యమును, తత్త్వమును, ప్రభావమును అర్థము చేసికొనుటకు తత్పరులము కావలయును. కారణము ఏమనగా మనకు ఈ మానవశరీరము భగవానుని నిర్హేతుకమైన దయవలన ప్రాప్తించినది. ఇందే యీ జీవుడు భగవానుని దయను గుర్తించి అతని దయకు పాత్రుడు కాగలడు. క్షణక్షణము ఆయువు చెల్లిపోవుచున్నది. మఱల ఇట్టి అవకాశము కావలెనని అనుకొన్నను లభించదు. కడచిపోయిన సమయము వెనుకకు మఱలిరాదు. కాబట్టి యిట్టి అమూల్యమైన మానవజీవితమును క్షుద్రములైన విషయభోగములందును, మాయామోహమయములైన వ్యాపారములందును, అలసత్వము ప్రమత్తతత మున్నగు అవలక్షణములకు లోబడి నిరర్థకముగా వెచ్చించివేసికొనుట యుక్తము కాదు.

❖ ❖ ❖